కథ

# అనుభవాలే గుణపాఠాలు

**ఆ రోజు టీవీలో టామ్ అండ్ జెర్రీ కార్టూన్‌షో చూస్తూ కిలకిలా నవ్వుతోంది జ్యోతి.**

**ట్రింగ్...ట్రింగ్... ఫోను మోగుతూనే ఉంది.**

**టీవీ ధ్యాసలో ఉన్న జ్యోతికి కానీ, వంటింట్లో మిక్సీలో పిండి రుబ్బుతున్న జానకికి కానీ బెడ్‌రూంలో రింగవుతున్న ఫోన్ శబ్దం వినిపించలేదు.**

రాత్రి షిఫ్ట్ డ్యూటీ చేసి బెడ్‌రూంలో నిద్రపోతున్న శేఖర్‌కి మాత్రం అదే పనిగా మోగుతున్న ఫోన్ నిద్రాభంగం కలిగించింది. ''ఏమే ఎక్కడున్నారంతా'' అని ఓ కేక పెట్టి బంగారం లాటి నిద్ర పాడైనందుకు విసుక్కుంటూ వచ్చి రిసీవర్ చెవికానించుకొని ''హలో'' అన్నాడు విసుగ్గా.

''హలో ఎవరూ శేఖరేనా మాట్లాడేది'' అన్నది అవతలి కంఠం.

''ఔను శేఖర్నే మీరెవరు?'' నిద్ర కళ్లతోటే అన్నాడు శేఖరు.

''నేనురా సత్యమూర్తిని''

''ఓ నువ్వా... ఏమిటి ఇంత పొద్దున్నే ఫోన్ చేశావ్ ఏమిటి సంగతి'' సత్యమూర్తి గొంతులో ఏదో ఉద్వేగం గమనించి అన్నాడు శేఖర్.

''నీకు తెలుసా సెవెంత్ రిజల్ట్స్ వచ్చాయిట. ఇంటర్నెట్‌కెళ్లి మీ జ్యోతి రిజల్ట్ కనుక్కో'' అన్నాడు సత్యమూర్తి.

శేఖర్‌కి నిద్రమత్తు వదిలిపోయింది.

''జానకీ...'' అంటూ భార్యని పిలుస్తూ వంటింట్లోకి నడిచాడు శేఖర్.

''అపుడే లేచారా బ్రష్ చేసుకోండి కాఫీ తెస్తాను'' ఫిల్టరులోంచి డికాషన్ గిన్నెలోకి వంచుతూ అన్నది జానకి.

''సెవెంత్ రిజల్ట్స్ వచ్చాయిట ఇంటర్నెట్ సెంటర్‌కెళ్లి కనుక్కురావాలి''

''అపుడేనా.. పరీక్షలయి నెలరోజులు కూడా కాలేదుగా అయినా మీకెలా తెలిసింది? ఎవరు చెప్పారండీ'' అన్నది జానకి.

''మా ఫ్రెండు సత్యమూర్తి ఫోన్ చేసి చెప్పాడులే. అరగంట నుంచీ ఫోన్ చేస్తున్నాట్ట నువ్వా ఫోన్ తీయలేదు... జ్యోతీ తీయలేదు. మంచి నిద్రలో ఉన్నాను. ఉలిక్కిపడి లేచాను. ఏమిటో ఈ కొంపలో ఎవరి గోల వారిదే. ఎవరికీ ఏమీ పట్టదు'' బ్రష్ మీద పేస్టు వేసుకుంటూ అన్నాడు శేఖర్.

''ఇది మరీ బాగుంది పని హడావిడిలో ఉండి మిక్సీ శబ్దంలో ఫోన్ వినిపించలేదు కానీ ఎప్పుడూ నేనేగా ఫోన్ కాల్స్ రిసీవ్ చేసుకునేది. సందు దొరికితే చాలు నామీద నెపం వేస్తారు'' అనుకుంది జానకి.

జ్యోతి కార్టూన్‌షో చూస్తూ కిలకిలా నవ్వుకుంటూనే ఉంది ఇంకా. శేఖర్ గబగబా డ్రస్ చేసుకొని తయారయ్యేసరికి జానకి కాఫీ కప్పుతో వచ్చింది. కూతురి రిజల్టు గురించి ఆందోళన అపుడే ఆమె మనసు నిండా అలుముకుంది.

ట్రింగ్...ట్రింగ్...మంటూ ఫోను మళ్లీ మోగింది.

ఓ చేత్తో కాఫీ తాగుతూ రెండో చేత్తో రిసీవర్ అందుకున్నాడు శేఖర్.

''మీ జ్యోతి టోటల్ ఎంత?'' అవతల నుండి సత్యమూర్తి.

''ఏదీ ఇంకా వెళ్లందే ఇపుడే బయలుదేరుతున్నాను'' అన్నాడు శేఖర్.

''హర్నీ... ఇంకా వెళ్లలేదా ఏం మనిషివిరా. మా వాడికి ఐదు వందల ముప్పై టోటల్ వచ్చింది'' కాస్త గర్వంగా అన్నాడు సత్యమూర్తి.

''కంగ్రాట్స్ చాలా మంచి మార్కులు'' అభినందించాడు శేఖర్.

''థాంక్యూ. మీ జ్యోతి మార్కులు కనుక్కున్నాక ఫోన్ చేసి చెప్పు మరి'' అన్నాడు సత్యమూర్తి.

''అలాగేలే'' ఫోన్ పెట్టేసి ''సత్యమూర్తి ఫోన్ చేశాడు వాళ్లబ్బాయికి ఐదు వందల ముప్పై వచ్చాయిట'' భార్య వంక తిరిగి అన్నాడు శేఖర్.

''అబ్బా చాలా బాగా వచ్చాయండీ బహుశా స్కూల్ ఫస్టు అతనే నేమో!'' అన్నది జానకి.

''అయినా అవ్వచ్చు అయినా సత్యమూర్తి తక్కువ వాడేంటి... కొడుకుని చావగొట్టయినా చదివిస్తాడు''.

''మనమ్మాయికెలా వస్తాయో ఏమో! పరీక్షలప్పుడు కూడా పదింటికల్లా పడుకునేది. పోనీ కాసేపు బలవంతంగా కూర్చోపెట్టినా కునికిపాట్లు పడేది. పొద్దున్న కూడా ఆరయితేగానీ మంచం దిగేది కాదు'' దిగులుగా అన్నది జానకి.

''చిన్నపిల్ల అంతకన్నా ఏం చదూతుంది? అయినా మన జ్యోతి మొదట్నించీ సిస్టమేటిగ్గా చదూకుంది కాబట్టి మంచి మార్కులే వస్తాయి''

''సత్యమూర్తిగారి అబ్బాయి దీని తోటివాడేగా అయినా పరీక్షలనేసరికి రాత్రి పన్నెండు వరకూ చదూకునే వాడుట. ఎంత కష్టపడితే వస్తుంది చదువూ!'' అన్నది జానకి.

''సత్యమూర్తి రాక్షసుడు. పిల్లల్ని అంత క్షోభ పెట్టి చదివించకూడదు'' ఖాళీ కప్పు భార్య చేతికిచ్చి బయలుదేరుతూ అన్నాడు శేఖర్.

''ఎక్కడికి డాడీ ఇంత పొద్దున్నే వెడుతున్నావ్'' టీవీ ఆపేసి తండ్రి వెనకే వస్తూ అన్నది జ్యోతి.

''ఇంకాసేపు చదూకోవే అంటే నాకన్నీ వచ్చు మమ్మీ మళ్లీ ఏం చదవనూ అనేదానివిగా, నీకేం వచ్చో నీ బండారమంతా ఈరోజే బైట పడుతుంది'' అన్నది జానకి.

''అసలు సంగతి చెప్పకుండా దాన్ని ఊరికే దెప్పి పొడవకు. పిల్లల్ని పిల్లల్లాగే ట్రీట్ చెయ్యడం నేర్చుకో'' అన్నాడు శేఖర్.

కొంత అర్థం అయి కానట్టు తండ్రివంకే చూస్తోంది జ్యోతి.

''నీ రిజల్టు కనుక్కోడానికెడుతున్నా. నీకెలాగూ మంచి మార్కులొస్తాయనుకో'' కూతుర్ని దగ్గరగా తీసుకొని వీపు మీద తట్టి ధైర్యం చెబుతూ అన్నాడు శేఖర్.

అప్పటి వరకూ కిలకిలా నవ్విన జ్యోతి ముఖం మారిపోయింది. ఏదో టెన్షన్‌తో, భయంతో బిగుసుకుపోయినట్టు కనిపించింది.

నిట్టూర్చాడు శేఖర్.

''నేనూ వస్తా డాడీ ప్లీజ్'' అభ్యర్థిస్తున్నట్టుగా అన్నది జ్యోతి.

''సరే పద'' అన్నాడు శేఖర్ స్కూటర్ తాళం తీసుకుంటూ.

''త్వరగా రండి నాకసలే కంగారెక్కువ'' అన్నది జానకి.

★ ★ ★

జానకీ, శేఖర్‌ల ఏకైక సంతానం జ్యోతి. చురుకుతనం, తెలివి కలబోసినట్టు ఎప్పుడూ హుషారుగా ఉంటుంది. జ్యోతి అంటే పంచప్రాణాలు శేఖర్‌కి.

చదువులో ఎపుడూ ముందుండే జ్యోతి మీద ఈగ వాలనివ్వడు శేఖర్. జానకికి మాత్రం భర్త కూతుర్నలా గారం చెయ్యడం ఇష్టం ఉండదు. పెద్దయ్యాక పెంకిగా తయారవుతుందని భయం.

★ ★ ★

కాలింగ్ బెల్ మోగడంతో తలుపు తీసింది జానకి. ఎదురుగా భర్త శేఖర్. పక్కనే వెలిగిపోతున్న ముఖంతో చేతిలో స్వీట్స్ పాకెట్‌తో జ్యోతి.

''మమ్మీ! నాకు ఐదు వందల నలభై మార్కులొచ్చాయి. అంటే నైంటీ పర్సెంట్'' ఉద్వేగంగా అన్నది జ్యోతి.

జానకి కూతుర్ని గట్టిగా కావలించుకొని నుదుటి మీద ముద్దుపెట్టుకుంది.

తన కూతురి మార్కులని సత్యమూర్తికి ఫోన్ చేసి చెప్పాడు శేఖర్. ''జానకీ! మన ఇరుగుపొరుగు వాళ్లందరికీ స్వీట్స్ పంచు'' అన్నాడు శేఖర్.

''మమ్మీ నేనే ఇచ్చి వస్తాను'' అన్నది జ్యోతి ఉత్సాహంగా.

''అలాగే'' అంటూ స్వీట్స్ పాకెట్ జ్యోతికందించింది జానకి.

''ఏమిటి జ్యోతీ స్వీట్ ఇస్తున్నావ్ నీ బర్త్‌డేనా'' స్వీట్ అందుకుంటూ అన్నాడు ఎదురింటి మోహన్రావ్.

''కాదంకుల్ నాకు సెవెంత్‌లో ఫైవ్ ఫార్టీ మార్క్స్ వచ్చాయి అందుకని'', మెరిసే కళ్లతో అన్నది జ్యోతి.

''వెరీ గుడ్... ఇంతకీ నువు పరీక్ష రాసిన సెంటరేదీ''

చెప్పింది జ్యోతి.

''అదా ఆ సెంటర్‌లో బాగా కాపీయింగ్ జరిగిందంటగా. బిట్ పేపరంతా ఎగ్జామినర్సే చెప్పేశారుటగా'' స్వీట్ తింటూ అన్నాడు మోహన్రావు.

''కాపీయింగ్ జరిగిన మాట నిజమే కానీ నేను సిన్సియర్‌గానే పరీక్ష రాశానంకుల్'' అన్నది జ్యోతి.

''అహ నిన్ననట్లేదమ్మా నేను. ఏది ఏమైనా ఇదివరకటి లాగా పకడ్బందీగా జరగటల్లేదు పరీక్షలు ఈ రోజుల్లో''

జ్యోతికేమనాలో తెలీక వెళ్లొస్తానంకుల్ అంటూ వెనుదిరిగింది.

★ ★ ★

''ఆంటీ స్వీట్ తీసుకోండి'' పక్కింటి వసంతకి స్వీట్ అందించింది జ్యోతి.

''ఏమిటి విశేషం'' తడి చేతులు చీరచెంగుకి తుడుచుకుంటూ అన్నది వసంత.

''సెవెంత్‌లో నాకు నైంటీ పర్సెంట్ వచ్చిందాంటీ'' అన్నది జ్యోతి కాస్త గర్వంగా.

''కంగ్రాట్స్ జ్యోతీ. ఇంతకీ నువ్వు ట్యూషన్ చదివింది రవి మాస్టారు దగ్గరేనా'' అడిగింది వసంత.



''ఔనాంటీ'' జవాబిచ్చింది జ్యోతి.

''అలా చెప్పు సంగతి. మీ ట్యూషన్ మాస్టారు తన దగ్గర ట్యూషన్ చదివే పిల్లలకి స్లిప్పులందిస్తాడటగా. మీ అంకుల్‌కి కూడా మీ ట్యూషన్ మాస్టారు పరీక్ష సెంటర్ దగ్గరే కనిపించాడట చాలాసార్లు'' ఏదోలా అనిపించింది జ్యోతికి.

''నాకు మా మాస్టారు ఏ స్లిప్పూ అందించలేదాంటీ. మేం పరీక్ష రాసి బైటకి రాగానే పరీక్ష ఎలా రాశామో కనుక్కునే వారు అంతే''

''అంతే అయి ఉంటుందిలే. అయినా మా మాస్టారు స్లిప్పులందించారని ఎవరైనా బైటికి చెప్పుకుంటారా. ఇవన్నీ ఓపెన్ సీక్రెట్స్'' తానేదో జోక్ చేసినట్టు పెద్దగా నవ్వుతూ అన్నది వసంత.

**ఆదుర్తి బాల**

ముఖం చిన్నబుచ్చుకొని ''వస్తానాంటీ'' అన్నది జ్యోతి.

★ ★ ★

''ఆంటీ... ఆంటీ'' ఎలాటి కామెంట్ వినాల్సొస్తుందో అని భయపడుతూనే తలుపు కొట్టింది జ్యోతి.

''ఎవరూ'' ముఖం చిటపటలాడించుకుంటూ వచ్చింది రెండిళ్ల అవతల ఉన్న జాహ్నవి.

తలుపు తీస్తూనే ''నువ్వా... కల్పన కోసమేనా. మా కల్పన పరీక్ష తప్పింది తల్లీ నీతో ఆడుకోదిప్పుడు అన్నట్టు నీ పరీక్ష ఏమయింది'' అన్నది జాహ్నవి.

ఆవిడ కోపానికి కారణం వాళ్లమ్మాయి కల్పన

పరీక్ష తప్పడమేనని అర్థమైంది జ్యోతికి. ఆ అమ్మాయి చాలా డల్ స్టూడెంట్. అయినా వాళ్ల మ్మగానీ నాన్నగానీ దాని గురించి అసలు పట్టించుకోరు. ఇంతలో అప్పటి వరకూ ఏడ్చిందేమో ఎర్రగా అయి ఉబ్బిన కళ్లతో వచ్చింది కల్పన.

## డబ్బు యావ

**కోటి విద్యలు కూటి కొరకే అయినా కొంతమందికి సంపాదనమీద విపరీతమైన యావ ఉంటుంది. సినీ తారలైతే తాము నటించిన సినిమాలు హిట్ అయితే ఆ తరువాత వచ్చే సినిమాలకి పారితోషికాన్ని బాగా పెంచేస్తారు. ఈ కారణంగా నిర్మాతలు ఇలాంటివారితో సినిమాలు తీయడానికి భయపడుతుంటారు. అందాలసుందరి ప్రియంకాచోప్రా ఇప్పుడు విపరీతమైన డబ్బుయావతో అనేక సినిమా ఛాన్స్‌ల్ని మిస్ చేసుకుంటోంది. అనిల్‌శర్మ కొత్త చిత్రం 'అబ్ తుమ్హారే హవాలె వాతన్ సాథియానొ' చిత్రం కూడా ఆమె చేతిలోంచి జారిపోయింది. దీంతోపాటు మరో సినిమా నుంచి కూడా ఆమెని తప్పించేశారు. దీనికంతటికీ కారణం ఆమెకున్న సంపాదనా ఆపేక్ష అని అంతా అంటున్నారు.**

ఇటువంటప్పుడు వాళ్లకి స్వీటు ఇవ్వాలంటే భయం వేసింది జ్యోతికి.

''ఆ స్వీట్స్ ఏంటి? పరీక్ష పాసయ్యావా? ఎన్ని మార్కులొచ్చాయి''? ప్రశ్నల వర్షం కురిపించింది జాహ్నవి.

అన్నిటికీ సమాధానం చెప్పింది జ్యోతి.

''అదృష్టంలే తల్లీ. అదృష్టవంతుడిని తంతే గారెల బుట్టలోపడ్డట్టు లేకపోతే ఇద్దరూ ఒకే సెక్షను. ఇద్దరికీ ఒకే ట్యూషన్ మాస్టారూ... అయినా మా కల్పన తప్పింది. ఏం చెప్తాంలే ఎవరి గీత ఎటువంటిదో'' దీర్ఘం తీస్తూనే కల్పన నెత్తిన రెండు మొట్టింది జాహ్నవి. కల్పన మళ్లీ ఏడుపు లంకించుకుంది.

జ్యోతికి బాధ అనిపించింది. అసలు తను స్వీట్స్ పంచకపోయినా బాగుండుననిపించింది.

చివరగా సత్యమూర్తి ఇంటికి బయలుదేరింది.

తలుపు తట్టబోయి లోపల్నించి వస్తున్న మాటలు వింటూ అక్కడే ఆగిపోయింది జ్యోతి.

''జ్యోతికి నైంటీ పర్సెంట్ వచ్చింది, శేఖర్ ఫోన్ చేసి చెప్పాడు'' అది సత్యమూర్తి గొంతు.

''ఆ జ్యోతికి అన్ని మార్కులు రావడమేమిటండీ. పిల్ల చూస్తే ఎక్కువ చదివినట్టు కూడా కనిపించదు'' సత్యమూర్తి భార్య అంటోంది.

''ఔను పరీక్షలపుడు కూడా రాత్రి పదింటికే నిద్రపోయేదిట. విడి రోజుల్లో కూడా ఎక్కువగా బైట ఆడుతూనే కనిపించేది'' అంటున్నాడు సత్యమూర్తి.

''మనవాడు ఎంత కష్టపడ్డాడూ! వెర్రి వెధవ రాత్రి పన్నెండింటి వరకూ పుస్తకం ముందేసుకొని కూర్చొనేవాడు. అయినా పేపర్ దిద్దే టీచర్స్ కూడా వాళ్ల మూడ్‌ని బట్టి మార్కులేస్తారటగా నిజమేనా'' అంటోంది సత్యమూర్తి భార్య.

''కొంతవరకూ అది కూడా నిజమేనేమో'' అంటున్నాడు సత్యమూర్తి.



జ్యోతికి కళ్లనీళ్లు తిరిగాయి. ఇంక వాళ్ల తలుపు కొట్టకుండానే తిరిగి వచ్చేసింది.

★ ★ ★

''అప్పుడే అందరికీ పంచేశావా..

ఏమన్నారందరూ వెరీగుడ్ అన్నారా? కంగ్రాట్స్ చెప్పారా?'' అంటున్న జానకి జ్యోతి ముఖం అదోలా ఉండడం గమనించి గాబరాపడింది.

మౌనంగా బెడ్‌మీద పడుకొని దుఃఖం పొంగిరాగా వెక్కివెక్కి ఏడుస్తోంది జ్యోతి.

''ఏమైందిరా... ఎందుకేడుస్తున్నావ్ ఎవరైనా ఏమైనా అన్నారా?'' అనునయంగా అన్నాడు శేఖర్.

''అందరికీ స్వీట్స్ ఇచ్చావా లేదా'' అనుమానంగా అన్నది జానకి.

''ఊ'' వెక్కుతూనే అన్నది జ్యోతి.

''సత్యమూర్తి అంకుల్‌కి ఇచ్చావా'' అడిగాడు శేఖర్.

తల అడ్డంగా ఊపి మళ్లీ వెక్కిళ్లు పెట్టింది జ్యోతి.

''ముందు ఈ చల్లటి నీళ్లు తాగి తరువాత ఏమయిందో చెప్పు'' ఐస్ వాటర్ కూతురుకి అందిస్తూ అన్నది జానకి.

మంచి నీళ్లు తాగి జరిగిందంతా చెప్పింది జ్యోతి.

నివ్వెరపోయింది జానకి.

శేఖర్ నిట్టూర్చాడు.

''ఈ ప్రపంచమంటేనే రకరకాల మనుషులు. రకరకాల మనస్తత్వాలూ. ఎవరైనా కష్టపడి ఏదైనా విజయం సాధిస్తే అది అతడి అదృష్టం అంటారు. లేకపోతే వాడికి స్టార్ తిరిగింది. అందుకే పట్టిందల్లా బంగారమౌతోంది అంటారు.

కానీ జీవితంలో ఎంత కష్టపడితే ఎన్ని ప్రయత్నాలు చేస్తే అంత సక్సెస్ అయ్యాడో అని అనుకోరు.

అలా అనుకోడానికి వారికి మనసొప్పదు. లేకపోతే వాడేదో అడ్డదారుల్లో పైకొచ్చాడంటారు.

వాడిలా అడ్డదారి తొక్కితే మేం ఎపుడో పైకొచ్చేవాళ్లం అంటారు.

అక్కడికి వీళ్లేదో నిజాయితీగా ఉన్నట్టు. ఇలాటి మనుషుల మనస్తత్వాల గురించి ఏ చదువూ నేర్పించదు.

జీవితం గురించి తెలిపేవి ఈ అనుభవాల గురువులే. మన పని మనం నిజాయితీగా చేస్తున్నపుడు ఇలాటి వారి మాటలని పట్టించుకొని బాధపడక్కర లేదు'' కూతుర్ని దగ్గరగా తీసుకొని ఓదార్పుగా అన్నాడు శేఖర్.